సాక్షి
అనంతపురం
గురువారం । 10 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



తగ్గిన టమాట ధర

టమాట ధర తగ్గింది. కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.88, కనిష్టం రూ.52, సరాసరి రూ.73 పలికింది.

గరిష్టం/కనిష్టం
36.4°/22.6°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

గిరిజనుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం రూరల్: గిరిజనుల సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. బుధవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్ జైన్, గిరిజన సంఘాల నాయకులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గిరిజనుల సంస్కృతిలోనే క్రమశిక్షణ, నిజాయితీ ఇమిడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి అన్నాదొర, అఖిల భారత బంజారా సంఘం ప్రెసిడెంట్ కేశవనాయక్, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకులు గుజ్జల లక్ష్మణ్ కుమార్, జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

98-డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల సర్వీస్ రెన్యూవల్



రాప్తాడురూరల్: 98- డీఎస్సీ ఎంటీఎస్ పద్ధతిలో పని చేస్తున్న ఎస్జీటీల సర్వీస్‌ను 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి రెన్యూవల్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) కింద రాష్ట్ర వ్యాప్తంగా 4,534 మంది ఎస్జీటీలుగా పని చేస్తుండగా.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 485 మంది పని చేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో వీరు జూన్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు పని చేయనున్నారు. మే నెలలో 'నోవర్క్-నోపే' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా రెన్యూవల్ ఉత్తర్వులు రాని కారణంగా ఈ విద్యా సంవత్సరం వీరికి ఇంకా జీతాలు పెట్టలేదు. రెన్యూవల్ ఉత్తర్వులు అందడంతో జీతాల విడుదలకు మార్గం సుగమమైంది. ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల ఎంటీఎస్ టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



ఉత్తర్వులు అందుకుంటున్న కార్మికులు

అనంతపురం రూరల్: ఆప్కాస్ పరిధిలోకి తమను చేర్చి ఉద్యోగ భద్రత కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని సాంఘిక సంక్షేమ శాఖ నాల్గో తరగతి ఉద్యోగులు తెలిపారు. సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వం ఇటీవల ఆప్కాస్ పరిధిలోకి చేరుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రావు అందజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పయ్య పాల్గొన్నారు.

త్యాగాలు స్మరిద్దాం

- మహనీయుల బాటలో నడవాలి
- 'నా భూమి – నా దేశం' హెరిటేజ్ వాక్‌లో కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే అనంత

అనంతపురం అర్బన్: దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ మహనీయుల బాటలో నడవాలని కలెక్టర్ ఎం.గౌతమి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా భూమి- నా దేశం' పేరిట బుధవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డీఐజీ ఆర్.ఎన్.అమ్మిరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కలెక్టర్ కుశాల్‌జైన్, అహుడా చైర్‌పర్సన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి పాల్గొని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముందుగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి- నా దేశం కింద బుధవారం నుంచి ఈ నెల 14 వరకు కార్యక్రమాలు నిర్వహించి, 15న స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా జరుపుకుంటామన్నారు. స్వాతంత్య్రోద్యమంలో ఎందరో వీరులు తమ ప్రాణాలర్పించారన్నారు. ఆ మహనీయుల త్యాగాల ఫలితంగా ఈ రోజు మనమంతా స్వేచ్ఛావాయువు పీలుస్తున్నామన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకోవడం మన కర్తవ్యం అన్నారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, డీఈఓ సాయిరాం, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తెలుగు తల్లికి పూలమాల వేసిన కలెక్టర్, డీఐజీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు



'నా భూమి - నా దేశం' ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

తాగునీరు, నారు మడులకు మాత్రమే..



అనంతపురం సెంట్రల్: తుంగభద్ర ఎగువ కాలువ పరిధిలోని హెచ్ఎల్ఎంసీ, జీబీసీలకు గురువారం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ ఎస్.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకాల్వలపై తాగునీటి పథకాలకు, నారు మడులు సాగు చేసుకునేందుకు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది తుంగభద్ర జలాశయం నుంచి దామాషా ప్రకారం 26.828 టీఎంసీలు రానున్నట్లు అంచనా వేశామని తెలిపారు. ఇందులో 10టీఎంసీల నీరు తాగునీటి అవసరాలకు, మిగిలిన నీటిని ఆయకట్టుకు కేటాయించినట్లు వెల్లడించారు. ఆయకట్టుకు ఎప్పటి నుంచి నీటిని ఇవ్వాలనే అంశంపై త్వరలో జరిగే సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ప్రతిపాదిత పంటలను మాత్రమే సాగు చేసుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

రెండు నామినేషన్ల దాఖలు

అనంతపురం రూరల్: జిల్లాలో వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడిన పంచాయతీ సర్పంచ్ స్థానాలకు బుధవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు. పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడు సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. జిల్లాలోని రెండు సర్పంచ్, 33 వార్డు మెంబర్ స్థానాలకు గురువారం సాయంత్రంలోగా నామినేషన్లు దాఖలు చేయాలన్నారు.

నవదంపతుల్లో వెల్లివిరిసిన సంతోషం

- కల్యాణమస్తు, షాదీ తోఫా సాయం విడుదల
- పెళ్లికుమార్తెల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ



వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు

అనంతపురం : పేదింటి నవ దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం 'పెళ్లి కానుక' అందించింది. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకం కింద ఆర్థికసాయం చేసింది. పెళ్లి కుమార్తెల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయినట్లు మెసేజీ రాగానే నవదంపతుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో వివాహాలు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ, భవన నిర్మాణ కార్మిక కుటుంబాల్లో అర్హులైన వారికి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా నిధులను బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ బటన్ నొక్కి వధువుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గౌతమి పాల్గొన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద జిల్లాలోని 836 మందికి రూ.6.49 కోట్లు పెళ్లి కుమార్తెల తల్లుల ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు. పేద కుటుంబాల్లో అమ్మాయిల వివాహ సమయంలో సామాజిక బాధ్యతతో రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలిచిందన్నారు. ఆర్థిక భరోసా పొందిన జంటలు సీఎంకు కృతజ్ఞతలు తెలపాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, బీసీ కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.75 వేలు, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, రిజిస్టర్డ్ భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పెళ్లి కుమార్తెల తల్లుల ఖాతాలకు, తల్లులు లేకుంటే పెళ్లికూతుళ్ల ఖాతాలకు నగదును నేరుగా జమ చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను బాగా చదివించాలని సూచించారు. ఆడపిల్లల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం సలీం, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖుష్బూ కొఠారి, మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలందించాలి



పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో వివరాలు తెలుసుకుంటున్న సెంట్రల్ టీమ్

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్య సేవలందించాలని సెంట్రల్ టీమ్ సభ్యులు డాక్టర్ సునీత బాటియా, డాక్టర్ సుమన్ దేవ్ చక్ర బార్టీ అన్నారు. బుధవారం రాప్తాడు పీహెచ్‌సీని సెంట్రల్ టీమ్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు) సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ పరిసరాలు, పని చేసే సిబ్బంది, టైమింగ్ బోర్డును పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగం, ఫార్మసీ విభాగం, కాన్పుల గదితో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలని, ఎవరూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా చూడాలని సూచించారు. పీహెచ్‌సీలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేసే విధానం, సాధారణ పరిపాలన విభాగం గురించి తెలుసుకునేందుకే తాము పరిశీలనకు వచ్చామన్నారు. కార్యక్రమంలో జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల జిల్లా క్వాలిటీ మేనేజర్ స్టీఫెన్, శైలజ, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్ వైజర్లు అరుణ, లక్ష్మీ నరసమ్మ, ఏఎన్ఎం లీలావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసమే కుట్రలు

- పుంగనూరు ఘటనకు పూర్తి బాధ్యత చంద్రబాబుదే
- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: అధికార దాహంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రాజెక్టుల పరిశీలన పేరుతో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే నీచ సంస్కృతికి తెరలేపారని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. అధికారం కోల్పోవడం, తిరిగి అధికారం దక్కదనే వాస్తవాన్ని గ్రహించిన చంద్రబాబుకు మతి భ్రమించిందన్నారు. దీంతో రాష్ట్రంలో అలజడులు సృష్టించి లబ్ధి పొందాలనుకుంటున్నారన్నారు. ఇందుకు పుంగనూరు ఘటననే నిదర్శనమన్నారు. చంద్రబాబు ప్రత్యక్షంగా టీడీపీ గూండాలను రెచ్చగొట్టి పోలీసులపై ఉసికొల్పిన తీరును రాష్ట్ర ప్రజలందరూ ప్రత్యక్ష ప్రసారాల్లో వీక్షించారన్నారు. ఈ ఘటనకు సంబంధించి చంద్రబాబుపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ క్యాలెండర్ అమలవుతున్న రాష్ట్రంలో జగనన్న పాలన సజావుగా సాగుతోందన్నారు.

మాతాశిశు మరణాలపై విచారణ



విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ యుగంధర్

అనంతపురం క్రైం: నగరంలోని రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ విచారణ చేపట్టారు. శివచైతన్య ఆస్పత్రిలో జరిగిన మాతృ మరణం, స్నేహలత నర్సింగ్ హోంలో చోటు చేసుకున్న శిశు మరణాలకు సంబంధించి ఆయా ఆస్పత్రుల గైనకాలజిస్టులు డాక్టర్ చైతన్య, డాక్టర్ శివజ్యోతిలను బుధవారం తన చాంబర్‌లో ఆయన విచారణ చేశారు. గత నెల 31న అనంతపురంలోని వెంకట్రామ్‌నగర్‌కు చెందిన వలంటీర్ ప్రశాంతి(32).. శివచైతన్య ఆస్పత్రిలో ప్రసవం కోసం వెళ్లి మగబిడ్డకు జన్మనిచ్చి మృత్యువాత పడింది. ఈ నెల 1న అనంతపురంలోని 5వ రోడ్డుకు చెందిన కళ అలియాస్ రేష్మబాను మూడో కాన్పు కోసం స్నేహలత ఆస్పత్రిలో అడ్మిట్ కాగా పుట్టిన బిడ్డ మృత్యువాత పడింది. సంబంధిత వైద్యుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతూ డీఎంహెచ్ఓ రెండు ఆస్పత్రుల యాజమాన్యాలకూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా గైనకాలజిస్టులు డాక్టర్ చైతన్య, డాక్టర్ శివజ్యోతిలను డీఎంహెచ్ఓతో పాటు ప్రభుత్వ సర్వజనాస్పత్రి అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్ కుమార్, చిన్నపిల్లల విభాగాధిపతి రవికుమార్ లోతుగా విచారణ చేశారు. మృతికి గల కారణాలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ త్రిసభ్య విచారణ కమిటీ నివేదికను కలెక్టర్ గౌతమికి అందజేసి, తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

2.30 లక్షల హెక్టార్లలో 'ఖరీఫ్'

- నగానికి పడిపోయిన వేరుశనగ సాగు
- అంచనాకు మించిన మొక్కజొన్న, ఆముదం
- సాధారణ విస్తీర్ణం నమోదైన సజ్జ, కంది పంట
- 1.40 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయానికి ప్రణాళిక



రాప్తాడు వద్ద సాగైన వేరుశనగ



పాలవాయి వద్ద మొక్కజొన్న పంట

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రధాన పంటల సాగు గడువు ఈ నెల ఐదో తేదీతో ముగిసింది. ఇక ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది. జూలై రెండో పక్షంలో వరుసగా కురిసిన తేలికపాటి వర్షాలు 'ముంగారు'కు ఊపిరిపోశాయి. లేదంటే ఖరీఫ్ కష్టాలు కాస్త ఎక్కువనే ఉండేవని చెబుతున్నారు. వ్యవసాయశాఖ తాజాగా సేకరించిన సాగు గణాంకాలు తీసుకుంటే 62 శాతం విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.70 లక్షల హెక్టార్లుగా అంచనా వేయగా 2.30 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. మిగిలిన 1.40 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ సాగును ప్రోత్సహించనున్నారు. ఇందుకోసం 80 శాతం రాయితీతో పెసలు, అలసంద, ఉలవ, కొర్ర తదితర విత్తనాలు 14 వేల క్వింటాళ్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

నగానికి తగ్గిపోయిన వేరుశనగ

ప్రధానపంట వేరుశనగ విస్తీర్ణం ఈసారి గణనీయంగా తగ్గిపోవడం విశేషం. 2.31 లక్షల హెక్టార్ల అంచనాకు గానూ 1.16 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. ఇక మొక్కజొన్న, ఆముదం అయితే అంచనాకు మించి వేశారు. 8,431 హెక్టార్లకు గాను 166 శాతంతో 14 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగైంది. 133 శాతంతో 12,463 హెక్టార్లకు గాను 16,561 హెక్టార్లలో ఆముదం వేశారు. సజ్జ, కంది, కొర్ర తదితర పంటలు సాధారణ సాగు నమోదు చేసుకున్నాయి. మరో ప్రధానపంట పత్తి 77 శాతం నమోదు చేసుకుంది. వేరుశనగ సగానికి తగ్గిపోవడంతో ప్రత్యామ్నాయం అవసరం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు.

తేలికపాటి వర్షాలు

జూన్‌లో 61 మి.మీ గాను 24.9 శాతం తక్కువగా 45.8 మి.మీ నమోదు కావడంతో ముందస్తు సాగు జరగలేదు. ఇక జూలై మొదటి పక్షం కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే జూలై రెండో పక్షంలో పరిస్థితి మారడంతో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షాలు కురిశాయి. జూలైలో 63.9 మి.మీ గానూ 15 శాతం అధికంగా 73.2 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో సీజన్ చివర్లో సాగు విస్తీర్ణం పెరిగింది. గత రెండు నెలల్లో 17 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదైనా ఎక్కడా భారీ వర్షాలు కురవలేదు.

ఈ ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగు ఇలా..

పంట	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
వేరుశనగ	2,31,151	1.16 లక్షలు
కంది	30,225	35,176
పత్తి	51,612	39,727
ఆముదం	12,463	16,561
మొక్కజొన్న	8,431	13,959
సజ్జ	1,355	1,333
కొర్ర	1,654	1,390
పొద్దుతిరుగుడు	1,978	683
జొన్న	7,041	652

క్లుప్తంగా

ఆటో బోల్తా... ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడిన భానుచరణ్, పవన్ కళ్యాణ్

కళ్యాణదుర్గం రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. కంబదూరు మండలం మర్రిమాకులపల్లి నుంచి ఎనిమిది మంది ప్రయాణికులతో బుధవారం ఉదయం కళ్యాణదుర్గానికి ఆటో బయలుదేరింది. కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్ వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన పందిని డ్రైవర్ తప్పించబోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో మానిరేవులోని సచివాలయ ఏఎన్ఎంగా పనిచేస్తున్న దాసంపల్లి నివాసి హేమలతతో పాటు బోయలపల్లికి చెందిన పవన్‌కుమార్, భానుచరణ్‌కు కాళ్లు విరిగాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులను కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

వాహనం ఢీకొని యువకులకు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన నరసింహ, తేజ బుధవారం సాయంత్రం గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతుండగా పాలిటెక్నిక్ కళాశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ఇద్దరికీ కాళ్లు విరిగాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా అనంతపురం వైపు ఉడాయించాడు. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను కళ్యాణదుర్గంలో సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చారిత్రకం.. సుందరం


కలెక్టర్ కార్యాలయంలో గోడలకు రంగులు వేస్తున్న దృశ్యం



కార్యాలయ ప్రహరీపై జిల్లా సంస్కృతి, గాంధీజీ బొమ్మను చిత్రీకరిస్తున్న దృశ్యం

చారిత్రక కట్టడంగా నిలిచిన అనంతపురం కలెక్టరేట్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ నాయకులు, జిల్లా సంస్కృతి, చారిత్రక కట్టడాలపై ప్రజలను చైతన్య పరిచేలా సుందర కుడ్య చిత్రాలను చిత్రకారులు అద్భుతంగా చిత్రీకరిస్తున్నారు. దశాబ్దాల నాటి భవనానికి రంగులు అద్దుతున్నారు. దాదాపు వారం రోజులుగా పలువురు కార్మికులు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం




ఆకట్టుకుంటున్న జాతీయ నాయకుల బొమ్మలు


కలెక్టర్ కార్యాలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

ఆటో, స్కార్పియో ఢీ


ప్రమాదానికి కారణమైన స్కార్పియో

రాప్తాడు రూరల్: ఆటోను స్కార్పియోవాహనం ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన వెంకటలక్ష్మి, పార్వతీబాయి, బాలరాజు, పెద్దక్క మరికొందరితో కలసి బుధవారం సాయంత్రం ఉమేష్‌నాయుడు ఆటోలో అనంతపురం నగరం నుంచి ఇంటికి బయలుదేరారు. వైఎస్సార్ కాలనీ ప్రధాన రహదారి పక్కన డ్రైవర్ ఆటో నిలపడంతో ప్రయాణికులు దిగుతున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన స్కార్పియో వాహనం ఢీకొని, అదే వేగంతో ముందుకు దూసుకెళ్లింది. స్థానికులు అప్రత్తమై కేకలు వేసినా స్కార్పియో డ్రైవర్ వాహనాన్ని నిలపకుండా ఉడాయించాడు. ప్రమాదంలో ఆటో డ్రైవరుతో పాటు వెంకటలక్ష్మి, పార్వతీబాయి, బాలరాజు, పెద్దక్క గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అనంతపురం రూరల్ పోలీసులు వెంటనే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశారు. వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద దాటుకుని కళ్యాణదుర్గం మార్గంలో దూసుకెళ్లిన స్కార్పియోను పక్కా ఆధారాలతో బెళుగుప్ప నివాసి పాపిరెడ్డికి చెందినదిగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌తో పాటు వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

- కుటుంబానికి అండగా ఉంటామన్న ఎస్పీ శ్రీనివాసరావు


మారెన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కంబదూరు: మండలంలోని అండేపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు ఎర్ర మారెన్న (41) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం రాత్రి రాయదుర్గం పోలీసుస్టేషన్‌లో విధి నిర్వహణలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలిన ఆయనను తోటి సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నాగమణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు బుధవారం ఉదయం అండేపల్లి గ్రామానికి చేరుకుని బాధత కుటుంబసభ్యులను పరామర్శించారు. మారెన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మారెన్న భార్య నాగమణికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని భరోసానిచ్చారు. అంత్యక్రియలకు రూ.10 వేల తక్షణ సాయాన్ని అందజేశారు. అలాగే హోంగార్డు వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రూ.10 వేల ఆర్థిక సాయాన్ని డీఎస్పీ బి.శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో సీఐలు లక్ష్మణ, శ్రీనివాసులు, ఎస్‌ఐలు రాజేష్, సుధాకర్, ఆర్ఎస్ఐ మక్బూల్, హోంగార్డు ఇన్‌చార్జ్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మారెన్న మృతదేహానికి రాష్ట్ర జానపద, సృజనాత్మక ఆకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, ఎంపీటీసీ మల్లేష్ ఘనంగా నివాళులర్పించారు.

ఆకతాయిల భరతం పట్టండి

- డీఐజీ అమ్మిరెడ్డి


మాట్లాడుతున్న డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఆకతాయిల భరతం పట్టాలని దిశ పెట్రోలింగ్ సిబ్బందిని డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి ఆదేశించారు. నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్స్ నుంచి తెలుగుతల్లి కూడలి వరకూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, యువతులకు రక్షణ దిశగా పని తీరు ఉండాలని దిశ పెట్రోలింగ్ సిబ్బందికి సూచించారు. కళాశాలలు, పాఠశాలలు వదిలే సమయంలో రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో అమ్మాయిలపై ఈవ్ టీజింగ్ జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దిశ యాప్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ అధికంగా ఉన్న కూడళ్లలో స్కూలు పిల్లలు ఇబ్బంది పడకుండా సురక్షితంగా దాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు, అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, ఎ.హనుమంతు(ఏఆర్), దిశ డీఎస్పీ ఎం.ఆంథోనప్ప తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య వెల్లడించారు. గుంతకల్లులోని అరవిందనగర్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి మణికుమార్ ఇంట్లో గత నెల 24న చోరీ జరిగిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చోరీ ఘటనలో ఇద్దరు పాల్గొన్నట్లు నిర్ధారించారు. బుధవారం స్థానిక హనుమాన్ సర్కిల్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న బండారి విజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో మణికుమార్ ఇంట్లో చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి 3.5 తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఇదే కేసులో పరారీలో ఉన్న గుంతకల్లులోని శ్యామ్‌సన్‌పురానికి చెందిన కంసాలి పవన్‌బహుదూర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్ఐ మురహరి బాబు, సిబ్బందిని సీఐ అభినందించారు.

యల్లనూరులో చైన్‌స్నాచింగ్


దుండగుడి దాడిలో గాయపడిన లక్షుమమ్మ

యల్లనూరు: వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు లాక్కెళ్లాడు. పోలీసులు తెలిపిన మేరకు.. యల్లనూరులోని పోస్టాఫీసు సమీపంలో నివాసముంటున్న లక్షుమమ్మ అలియాస్ లక్ష్మీదేవి బుధవారం ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడకు చేరుకుని తనకు అన్నం పెట్టాలని అడిగాడు. దీంతో ఆమె అన్నం తీసుకువచ్చేందుకు ఇంట్లోకి వెళుతుండగా వెనుక నుంచి ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాగేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో ఆమె ప్రతిఘటించడంతో ముఖంపై బలంగా దాడి చేసి, బంగారు గొలుసు లాక్కొని ఉడాయించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పెండింగ్ కేసులు పూర్తి చేయండి

కళ్యాణదుర్గం: పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ తేజమూర్తికి ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం ఆయన కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, కేసులపై ఆరా తీశారు. ఎస్పీ వెంట డీఎస్పీ బి.శ్రీనివాసులు, ఎస్ఐలు ఉన్నారు.

నేడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

రాప్తాడురూరల్: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని డీఈఓ ఎం.సాయిరామ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 1 నుంచి 4 వరకు జరిగిన ఫార్మేటివ్ అసెస్మెంట్–1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను తల్లిదండ్రుల సమావేశాల్లో ప్రదర్శించి చర్చించాలని పేర్కొన్నారు. విద్యార్థుల స్థాయిని మరింత పెంచడానికి చేయాల్సిన కృత్యాలపై చర్చ జరగాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు పెంపు, ట్యాబ్స్ వినియోగం, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, వర్క్‌బుక్ – నోట్స్ పూర్తి చేయడం, పాఠశాలల్లో పరిశుభ్రత, నాడు–నేడు తదితర అంశాలపై చర్చించాలని సూచించారు. ప్రతి పాఠశాలలోనూ విధిగా తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం జరిగేలా ఎంఈఓలు, హెచ్ఎంలు చూడాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు ఈ సమావేశాలను పర్యవేక్షించాల్సి ఉంటుందని సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏటా ఇస్తున్న ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు దీపు కిరణ్‌రెడ్డి, సుంకర రమేష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పదేళ్లకు పైగా బోధనతో పాటూ ఇతర రంగాల్లో సమాజ చైతన్యం కోసం శ్రమిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు, కళాశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అర్హులు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదీలోపు 'ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయం, డోర్.నం.13/186, రెండో అంతస్తు, జూనియర్ కాలేజ్ ఎదురుగా, ఆర్ఎఫ్‌రోడ్డు, అనంతపురం' చిరునామాకు చేరేలా పంపాలి. పూర్తి వివరాలకు 90590 55965, 91602 19998లో సంప్రదించవచ్చు.

ఎస్కేయూతో ఎస్ఆర్ఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎస్ఆర్ఐటీ, ఎస్కేయూ ప్రతినిధులు

బుక్కరాయసముద్రం: ఇన్నోవేషన్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, టెక్నాలజీ పురోగతిని పెంపొందించేలా ఎస్కేయూలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలకు ఊతమిస్తూ ఎస్ఆర్ఐటీ కళాశాల మరో అడుగు ముందుకేసిందన్నారు. స్టార్టప్‌లను పెంపొందించడంలో భాగంగా వివిధ డొమైన్‌లలో వ్యవస్థాపక వెంచర్‌ల వృద్ధిని సులభతరం చేసేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐఅండ్ఈడీపీ కన్వీనర్ డాక్టర్ ఆంజనేయులు, ఏఐసీ ఎస్కేయూ సీఈఓ డాక్టర్ శివకిరణ్, ఇంక్యుబేషన్ మేనేజర్ డాక్టర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కొడుకు 420.. తండ్రి 840

- రాష్ట్రంలో అసలైన క్రిమినల్స్ చంద్రబాబు, లోకేష్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా


మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: కొడుకేమో 420, తండ్రేమో 840గా మారి రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు, లోకేష్‌పై ఉద్దేశించి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మండిపడ్డారు. బుధవారం తాడిపత్రిలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కనీస గౌరవం కూడా ఇవ్వకుండా నోటికి ఎంత మాట వస్తే అంత మాట్లాడుతూ సంస్కార హీనులుగా చంద్రబాబు, లోకేష్ మారారన్నారు. రాష్ట్రంలో అసలైన క్రిమినల్స్ ఎవరైనా ఉన్నారా అంటే అది చంద్రబాబు, లోకేష్ మాత్రమేనన్నారు. వీరిద్దరూ ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. 2014 ఎన్నికలకు ముందు 600 పైగా హామీలు ఇచ్చి అధికారం చేపట్టగానే వాటిలో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా అధికారం చేపట్టిన నాలుగేళ్లలో నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌దన్నారు. మంగళగిరిలో ప్రజలు ఛీకొట్టినా లోకేష్‌కు బుద్ధి రాలేదన్నారు. నాయకుడిగా గుర్తింపు లేని లోకేష్ మున్ముందు రోజుల్లో తన తాత, తండ్రి గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేశారంటూ వారి పేర్లు చెప్పుకుని బతకడం తప్ప మరేం చేయలేరని ఎద్దేవా చేశారు. ప్రజల మనసుల్లో హీరోగా ముద్ర వేసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు మరోసారి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అర్హుల దరి చేర్చిన సీఎం వైఎస్ జగన్ పట్ల సైకోలుగా మారి చులకనగా మాట్లాడితే సహించబోమని చంద్రబాబు, లోకేష్‌ను హెచ్చరించారు. కుప్పంలో ఓటమి ఖాయమని తెలుసుకున్న చంద్రబాబు.. ఆ ఫ్రస్టేషన్‌లో పుంగనూరులో అలజడులు సృష్టించి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తన అక్కసు వెళ్లగక్కుకునే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. టీడీపీలో ఎవరిపై ఎక్కువ కేసులుంటే వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామంటూ రాజకీయ నిరుద్యోగులను గూండాలుగా లోకేష్ మార్చేస్తున్నాడని మండిపడ్డారు. యువతకు ఇచ్చే సందేశం ఇది కాదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేష్ నైతిక విలువలు కాపాడుకోవడంపై దృష్టి సారిస్తే బాగుంటుందని, లేకపోతే ఉనికి కోల్పోవడం ఖాయమని అన్నారు. సమావేశంలో జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు రంగనాథరెడ్డి, రజకాభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డీవీ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, రాంశేఖర్, గురుప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయి కీర్తనం.. భక్త పరవశం

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ హర్యానా, చండీఘడ్ భక్తులు చేసిన సంగీత కచేరీతో భక్తులు పరవశం చెందారు. పర్తియాత్రలో భాగంగా బుధవారం పుట్టపర్తికి విచ్చేసిన భక్తులు సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహిళా భక్తులు సాయికుల్వంత్ సభా మందిరంలో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. సాయంత్రం హర్యానా, చండీఘడ్‌కు చెందిన బాలవికాస్ విద్యార్థులు మానసిక పరివర్తనతోనే మోక్షం సాధ్యం అన్న సందేశాన్నిస్తూ 'సాల్వేషన్ త్రూ ట్రాన్స్‌పర్‌మేషన్' పేరుతో నాటిక ప్రదర్శించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు హర్యానా రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ప్రభాత్ గుప్తా తమ రాష్ట్రంలో జరుగుతున్న సత్యసాయి సేవా కార్యక్రమాలను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి నూతన వస్త్రాలు జ్ఞాపికలను అందజేశారు.


సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

క్లుప్తంగా

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న స్వామి సన్నివాసానంద మహారాజ్

అనంతపురం కల్చరల్: విద్యార్థి దశలోనే నైతిక విలువలు పెంపొందించుకుంటే వారి భావి జీవితం ఉన్నతంగా ఉంటుందని వైఎస్సార్ జిల్లా రామకృష్ణ మిషన్‌కు చెందిన స్వామి సన్నివాసానంద మహారాజ్ అన్నారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం విద్యావాహిని కార్యక్రమం జరిగింది. హెచ్చెల్సీ కాలనీలోని రామకృష్ణ సేవా సమితి కార్యాలయం, రుద్రంపేటలోని ఉన్నత పాఠశాల తదితర చోట్ల భారతీయ విలువలు, నైతికత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు స్వామి వివేకానంద చిత్రపటం వద్ద అందరితో ప్రార్థన చేయించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నాగత్రిశూలపాణి, రామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మూర్తి, హెచ్‌ఎం సుమంగళి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: మాతా, శిశు మరణాల నియంత్రణలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలకు ఆదేశిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ స్పష్టం చేశారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గత నెలలో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరిగిన 6 శిశు మరణాలు, ఒక మాతృ మరణంపై సంబంధిత వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సేవలందించాలన్నారు. మొదటి కాన్పు సిజేరియన్, హై బీపీ, తదితర వాటిని హైరిస్కులుగా పరిగణించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు. 102, 108 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో పీఓడీటీ డాక్టర్ సుజాత, గైనకాలజిస్ట్ సుజాత, అనస్తీషియా వైద్యురాలు డాక్టర్ ఇందిర, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శంకర్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్ చిత్తు



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

రాప్తాడురూరల్: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. 'మత్తు పదార్థాలు–వాటి నివారణ' అంశంపై బుధవారం స్థానిక ఎస్‌ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల, కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలను వివరించారు. వీటి నియంత్రణలో విద్యార్థుల పాత్రను తెలియజేశారు. మత్తు పదార్థాలను కట్టడి చేసేందుకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 'సే నో టు డ్రగ్స్' వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్ రసూల్, ఆర్‌ఐఓ సురేష్‌బాబు, విద్యాశాఖ డీవైఈఓ, ఎక్సైజ్ సీఐ, స్పెషల్ ఎన్‌ఫోర్స్ బ్యూరో సీఐ, కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

తెల్లవారుజామునే తెరుచుకుంటున్న బార్లు



ఓ బార్‌లో ఉదయం 7:30 గంటలకే మద్యం తాగుతున్న దృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో బార్ల యజమానులు పోటీపడి మరీ తెల్లవారు జామునే తెరుస్తున్నారు. ప్రభుత్వం బార్లను తెరుచుకునేందుకు రాత్రి 12 గంటల వరకూ అనుమతి ఇచ్చినా.. యజమానులు రాత్రంతా తెరిచి ఉంచుతున్నారు. బార్లలో 24 గంటల పాటు యథేచ్ఛగా వ్యాపారం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బార్ల యాజమానులు ఇచ్చే మామూళ్లకు అధికారులు దాసోహం అవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బళ్లారి బైపాస్ రోడ్డులోని మూడు బార్లలో బుధవారం 'సాక్షి' నిఘా పెట్టింది. ఉదయం 6 గంటలకే తెరుచుకున్న బార్లు జనంతో కిక్కిరిసిపోయి దర్శనమిచ్చాయి.



పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న అంగార్‌వలీ పీరు



జలధికి తరలుతున్న పీర్లు

జలధికి తరలిన పీర్లు

గత పది రోజులుగా సందడిగా సాగిన చిన్నపీర్ల పండుగ వేడుకలు బుధవారం ముగిశాయి. నగరంలోని విద్యారణ్య నగర్‌కు చెందిన శ్రీసయ్యద్, సర్దార్‌వలి పీర్ల మకానం పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నిర్వాహకులు సర్దార్, వలి నేతృత్వంలో చక్కెర చదివింపులు చేసి పీర్లను జలధికి తీసుకెళ్లారు. అదేవిధంగా స్థానిక ఐదో రోడ్డులో తెల్లవారుజామున యువకులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. యువత అలావ్ తొక్కుతూ సందడి చేశారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు. ఈనెల 11న మహిమాన్విత బీబీ ఫాతిమా చివరి దర్శనం ఉంటుందని నిర్వాహకులు హనుమంతు, నరసింహులు తెలిపారు. అలాగే రెండవ రోడ్డు, నాల్గవ రోడ్డులో మొహర్రం వేడుకలు ముగిశాయి.

– అనంతపురం కల్చరల్:



భక్తిగీతాలాపన..



పీర్లతో అగ్నిగుండ ప్రవేశం

'రీసెర్చ్ ఎకానమీ'పై ప్రసంగించిన ఎంపీ రంగయ్య



కార్యక్రమానికి హాజరైన ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: ఢిల్లీలో నేషనల్ ఎకనమిక్ ఫోరం వారి ఆధ్వర్యంలో రీసెర్చ్ ఎకానమీ అనే అంశంపై బుధవారం వీక్లీ డిస్కషన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఆలమూరు లేఅవుట్ పరిశీలన

అనంతపురం క్రైం: ఆలమూరు లేఅవుట్‌ను నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా కరెంటు, నీరు, తదితర సదుపాయాల్లో జాప్యం లేకుండా చూసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, విద్యుత్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతంగా చేసేలా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోండి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన



ఆత్మకూరు: తలుపూరులో మాజీ జవాన్ జగదీష్ రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

అనంతపురం: దేశ రక్షణకు ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలని జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన అన్నారు. బుధవారం నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా సైనికుల త్యాగాలకు గుర్తుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పలువురు సైనికులను సన్మానించారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆజాదికా అమృత్ మహోత్సవ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.మమత ఆధ్వర్యంలో ఆగస్టు 9 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణాకాంతి, ఆర్మీ రిటైర్డ్ ఆఫీసర్ ఎస్. వెంకటేశ్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ ఎం.అంకారావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఆత్మకూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీపీ హేమలత తెలిపారు. మండల వ్యాప్తంగా బుధవారం అన్ని గ్రామ సచివాలయాల్లో నా భూమి–నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో 75 మొక్కల చొప్పున నాటినట్లు ఏపీఓ సుజాత, పుష్ప పేర్కొన్నారు. పలు గ్రామాల్లో మాజీ జవాన్‌లను సన్మానించారు. మండల కేంద్రంలో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేవలం ఫోటోలకు ఫోజులిచ్చి సమావేశాన్ని ముగించారు. ఎంపీడీఓ సెలవులో వెళ్లడంతో కనీసం మిగిలిన అధికారులు, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదు.

కనగానపల్లి: కనగానపల్లి, మామిళ్లపల్లి, ముత్తువకుంట్ల, ముక్తాపురంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నా భూమి– నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలసి అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఏపీఓలు వెంకటేష్ నాయక్, శంకర్, ఈసీ సాయిక్రిష్ణ, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు ఓబిరెడ్డి, నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మెన్లు, ప్రధానోపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ స్ఫూర్తిని నింపేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిద్దామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మేపర్తి, జి.కొత్తపల్లి, గాండ్లపర్తి గ్రామాల్లో నా భూమి–నా దేశం కార్యక్రమం జరిగింది. ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటి సంరక్షించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయం దగ్గర అధికారులు, నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, ఎంపీడీఓ సాల్మన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం: మొక్కల సంరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. ఎస్కేయూలో నాభూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ భవన్ వద్ద మొక్కలు నాటారు. ఆర్మీలో నాయక్ హోదాలో 18 సంవత్సరాలకు పైగా విశేషంగా కృషి చేసిన బీఏ రాజును సన్మానించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర డీడీఓ శ్రీనివాసులు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోమశేఖర్, యూఎస్‌ఓ అవార్డు గ్రహీత బిసాటి భరత్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ చాగంటి రామిరెడ్డి, సత్య సౌమ్య, రమణ, ధనుంజయ, హేమంత్, అనిత, విష్ణుప్రియ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జి.జీవన్ కుమార్ పాల్గొన్నారు.



మాజీ సైనికాధికారిని సన్మానిస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి



రాప్తాడు: బొమ్మేపర్తిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, అధికారులు

వివాహానికి ఆహ్వానం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెళ్లిపత్రిక అందజేస్తున్న ఓబుళపతి

రాప్తాడురూరల్: తన కుమారుడు కె.ఓంసాయి మోహన్ పెళ్లికి రావాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఓబుళపతి ఆహ్వానించారు. బుధవారం తాడేపల్లి కార్యాలయంలో ముఖ్యమంత్రికి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. సెప్టెంబరు 3న అనంతపురంలో వివాహం ఉంటుందని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా విద్య, ఉద్యోగ, ఉపాధ్యాయులు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఓబుళపతి వెల్లడించారు.

గ్రంథాలయం తనిఖీ

శింగనమల: స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథలయ సంస్థ కార్యదర్శి రమ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయానికి పాఠకులు ఎక్కువ మంది వచ్చేలా చూడాలని గ్రంథాలయం అధికారి కృష్ణకు సూచించారు. గ్రంథాలయం సెస్సు కట్టించాలని ఆదేశించారు.

మహేష్ బాబు జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



కేక్ కట్ చేస్తున్న మాజీ మేయర్ రాగే పరుశురాం

అనంతపురం క్రైం: సినీ నటుడు సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు బబ్లూ, నాగరాజు, విజయ్‌కృష్ణ, రవిరాజు, సికిందర్, మహమ్మద్ హుస్సేన్, శీన, హరి, అవేజ్, మనోజ్, త్రిలోక్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘం నాయకుడు కేఆర్ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద మాజీ మేయర్ రాగేపరుశురాం కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు బోయ లక్ష్మన్న, వెంకటేష్, అలంషెక్షా, శేఖర్‌బాబు, మంగళనారాయణ, ఆటో రఫీ, ఈశ్వర్, బాషా, హరి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి

అనంతపురం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయలని డీవైఎఫ్‌ఐ నాయకులు బుధవారం టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు దాటినా రైల్వే, రక్షణ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు.



టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

పూర్ణిమకు డాక్టరేట్



అనంతపురం: ఎస్కేయూలో బయో కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసిన హెచ్.పూర్ణిమకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ కే.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో 'ఆమెలీరోషన్ ఆఫ్ మైకోర్డియల్ ఇనఫార్‌క్షన్ ఇండూస్డ్ బై ఐసోప్రోటెరినాల్ (ఐఎస్‌ఓ) ఇన్ ఆల్బినో విస్టర్ రాట్స్ బై యాచిరాంథెస్ యాస్‌పెరా' అనే అంశంపై పూర్ణిమ పరిశోధన చేశారు. నేటి మానవ జీవనశైలిలో గుండెపోటు పరిణామం పెరగటం, గుండెపోటును నియంత్రించగల మార్గాలు, ఉత్తరేణికి గల ఆయుర్వేద ఔషధ గుణాలు గుండెపోటును ఎలా నియంత్రించగలదు అన్న అంశాన్ని వివరించారు. ఎలుకల్లో గుండెపోటును కృత్రిమంగా ప్రేరేపించడంపై పరిశోధన చేసి, నిరూపించారు.

అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం: వెంకటగిరిలో ఆగస్టు 10 నుంచి 29 వరకూ జరగనున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్–16 బాలుర అంతర జిల్లా క్రికెట్ టోర్నీకి బుధవారం జట్టును ఎంపిక చేశారు. జట్టు కెప్టెన్‌గా భార్గవరాజును నియమించారు. ఎం.భువనేశ్వర్, ఎస్. సంధాని, బి.ఠాకూర్ కుమార్, టి.భాను ప్రసాద్, జి. సిద్ధార్థ, సాయి ఫణిరాం తేజ్, డీఎం.సమీర్, వరుణ్ సాయి నాయుడు, టీవీ సాయి ప్రతాప్ రెడ్డి, మహమ్మద్ యాసిన్, నిశ్చయ్, టి.తమీమ్, బి.నంద కిశోర్, కుషాయ్ సాయి, హర్షవర్ధన్, చరణ్ నరసింహ, మహమ్మద్ ఆసిఫ్ జట్టు సభ్యులుగా ఉన్నారు

చెత్త సేకరణ పక్కాగా జరగాలి

అనంతపురం క్రైం: చెత్త సేకరణ పక్కాగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ భాగ్యలక్ష్మి పారిశుధ్య కార్యదర్శులను ఆదేశించారు. యూజర్ చార్జీల్లో వెనుకబడ్డ వారితో బుధవారం నగరపాలక సంస్థలో సమావేశమయ్యారు. మీరెందుకు వెనుకబడ్డారో చెప్పాలని కార్యదర్శులపై కమిషనర్ ఫైర్ అయ్యారు. అంకితభావంతో పని చేయాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

20 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీ నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈఓ అక్కిరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న నాగుల చవితి అష్టోత్తర శత కలశాభిషేకం, 21న సర్పసూక్త క్షీరాభిషేకం, 22న షష్టి మహోత్సవం, కల్యాణోత్సవం, 27న సామూహిక విష్ణుసహస్త్ర నామ పారాయణం, సెప్టెంబర్ 3న అన్నాభిషేకం, 10వ తేదీన శత సర్పసూక్త హరిద్రాభిషేకం, అశ్లేషాబలి, పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి కార్మిక శక్తి చూపిస్తాం



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కార్మికశక్తి చూపిస్తామని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బుధవారం నగరంలోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను కాలరాస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడ్‌లుగా తీసుకువచ్చి నష్టం చేకూరుస్తోందన్నారు. తక్షణం కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందన్నారు. కార్పొరేట్ సంస్థలు తీసుకున్న వేల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తున్న కేంద్రం ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కార్మిక సంఘాల నాయకులు కృష్ణుడు, శ్రీనివాసులు, రాజు, వెంకటనారాయణ, రామిరెడ్డి, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.